మాఫియా చేతుల్లో ఇసుక

- ట్రాక్టర్ ఇసుక బ్లాక్‌లో రూ. 7 వేలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 3 వేలు
- గృహ యజమానులకు భారంగా మారిన ఇసుక కొరత
- పోలీసులు–రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర

పెనమలూరు: ఇసుక క్వారీలను మాఫియా చేతుల్లోకి తీసుకోవడంతో మండల పరిధిలో ఇసుక కొరత తీవ్రంగా మారింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే హామీని తుంగలోకి తొక్కింది. దీంతో ఇసుక మాఫియా చెలరేగిపోయి ఇసుక అక్రమ రవాణా చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మాఫియా బాహాటంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. పెనమలూరు మండలం విజయవాడ నగరానికి శివారులో ఉండటంతో ఈ ప్రాంతంలో నగరం విస్తరించి నూతన భవన నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇసుక పుష్కలంగా లభించేది. ట్రాక్టర్ ఇసుక రూ. 3 వేలకే అందుబాటులో ఉండేది. డిమాండ్‌కు తగ్గట్లుగా ఇసుక సప్లయ్ ఉండేది. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం వచ్చి 100 రోజులు గడిచినా ఉచిత ఇసుక విధానం ఎక్కడా అమలు జరగడంలేదు. దీంతో ఇసుక అందుబాటులో లేక ఇసుక చాలా ప్రియంగా మారింది. ఈ అవకాశాన్ని ఇసుక మాఫియా క్యాష్ చేసుకుంటున్నారు.



చోడవరంలో మాఫియాకు చెందిన ఇసుక గుట్టలు

ఇసుక క్వారీలు లేవు

మండల పరిధిలో ఇసుక క్వారీలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లోని క్వారీలపైనే ఇక్కడి భవన నిర్మాణాలు ఆధారపడి ఉన్నాయి. ఇసుక క్వారీలు ఎప్పుడు ప్రారంభిస్తారా అని అందరూ ఎదురుచూస్తున్నారు. మద్దూరు, రొయ్యూరు, దిగువ ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ఉన్నాయి. అవి ప్రస్తుతం అందుబాటులో లేవు. అయితే ఎక్కడా ఉచిత ఇసుక విధానం అమలు జరగడంలేదు. ఇసుక క్వారీలు ఎప్పుడు ప్రారంభిస్తారో సమాధానం లేని ప్రశ్నగా ఉంది.

కార్మికులకు ఉపాధి ఏదీ?

ఇసుక ధరలు మండుతుండటంతో భవన నిర్మాణాల ఊపు తగ్గింది. దీంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు లేక పస్తులు ఉంటున్నారు. ప్రస్తుతం ఇసుక బంగారమైంది. భవన నిర్మాణ యజమానులు చేసేది లేక నిర్మాణాలు నిలిపివేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని వారు తెలుపుతున్నారు. ఆర్థికంగా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా

కాగా మండల పరిధిలో ఉన్న యనమలకుదురు ఇసుక క్వారీ నిషేధంలో ఉంది. కనకదుర్గ వారధి నిర్మాణం చేసిన తర్వాత యనమలకుదురు క్వారీని శాశ్వతంగా నిషేధించారు. అయితే ఇసుక మాఫియా రకరకాలుగా అక్రమ రవాణా చేస్తున్నారు. ఆటోలు, బైక్‌ల ద్వారా ఇసుక మూటలు రాత్రి సమయాల్లో అక్రమంగా తరలిస్తున్నారు. అలాగే ఇసుక మాఫియా గురువుల ర్యాంపు నుంచి ఎడ్ల బండిలో నది నుంచి అక్రమంగా తరలించి ట్రాక్టర్‌లలో లోడ్ చేసి ఒక ట్రాక్టర్ ఇసుక బహిరంగ మార్కెట్‌లో రూ. ఏడు వేలకు అమ్ముతున్నారు. నిషేధ క్వారీలో ఇసుక దందాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇక పెదపులిపాక క్వారీ కోర్టు స్టేలో ఉండగా, చోడవరం క్వారీలో తవ్వకాలు చేయరాదని ఏకంగా సుప్రీంకోర్టు ఆదేశించింది. మండల పరిధిలో క్వారీలకు నిషేధం ఉన్నా ఇసుక మాఫియా మాత్రం అక్రమ అమ్మకాలు చేస్తూ కాసులు సంపాదిస్తున్నారు.



యనమలకుదురు క్వారీలో ఇసుక అక్రమ తవ్వకాలు

ఇసుక ఉచితంగా ఇవ్వాలి



భవన నిర్మాణ కార్మికులు మనుగడ సాగించాలంటే ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం వెంటనే అమలు చేయాలి. ప్రస్తుతం ఇసుక ప్రియంగా మారడంతో భవన నిర్మాణాలు జరగడం లేదు. దీంతో ఉపాధి అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

– తిరువీధుల చంటి, తాపీ మేస్త్రీ, పెనమలూరు

దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గన్నవరం, బాపులపాడు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పి. వెంకటలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ల ప్రకారం గన్నవరం మండలంలోని ముస్తాబాద-2(ఎస్సీ), విఎస్.పురం(ఓసీ), మర్లపాలెం(ఓసీ), దుర్గాపురం(బీసీ-ఏ), తెంపల్లి-1(బీసీ-డీ), వీరపనేనిగూడెం-3(ఓసీ), వీరపనేనిగూడెం-4(ఓసీ), కేసరపల్లి-3(ఎస్సీ) దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బాపులపాడు మండలంలో బాపులపాడు-5(బీసీ-డీ), పెరికీడు-1(ఎస్సీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన 21 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగి స్థానికులైన వివాహిత మహిళలు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్హత, వయసు, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లనుదరఖాస్తుకు జతచేయాలని పేర్కొన్నారు.

కంకిపాడు: ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు సీడీపీఓ కె.బి. సుకన్య తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉయ్యూరు మండలం గండిగుంట-1(ఎస్సీ), పెనమలూరు మండలం గంగూరు-8 (ఎస్సీ), కంకిపాడు పట్టణం-10(బీసీ-బీ)కి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు పెనమలూరు-7(ఓసీ), వణుకూరు-4(ఓసీ), యనమలకుదురు-7(బీసీ-బీ), కంకిపాడు-3(ఎస్సీ), ఉప్పలూరు-3(బీసీ-ఏ), పునాదిపాడు-2(ఎస్సీ), పునాదిపాడు-3(బీసీ-ఏ), ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలోని సుందరమ్మపేట-3(బీసీ-డీ), ఎస్సీ కాలనీ-2(ఎస్సీ)కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను కంకిపాడు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా అందించాలని సూచించారు.

క్లుప్తంగా

ఎన్టీఆర్ శతకం పుస్తకావిష్కరణ



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంగ్లీష్ అసోసేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఆలపాటి పూర్ణచంద్రరావు రచించిన 'ఎన్టీఆర్ శతకం' పుస్తకాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడ బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో తెలుగుజాతికి గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ తన నటనతో ఎన్నో విభిన్న పాత్రలు పోషించి ప్రజల మనస్సులో శాశ్వత ముద్ర వేశారని చెప్పారు. బీజేపీ అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రచయిత డాక్టర్ ఆలపాటి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మూడు నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఏడు గంటలకు విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 3న వెంకమ్మ పేరంటాలమ్మను శ్రీ బాలత్రిపుర సుందరీ దేవిగా, 4న శ్రీ గాయత్రి దేవి, 5న అన్నపూర్ణ దేవి, 6న లలితా త్రిపుర సుందరీదేవి, 7న మహా చండీదేవి, 8న మహాలక్ష్మి దేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధినీ దేవి, 12న శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో నిర్వహించే దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సహస్ర నామార్చనలు, అష్టోత్తర శత నామార్చనలు, కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.

మాజీ స్పీకర్ బాలయోగికి నివాళి



పెనమలూరు: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 74వ జయంతిని పోరంకి టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. బాలయోగి చిత్ర పటానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం నిలబెట్టే విధంగా పని చేసిన వ్యక్తి బాలయోగి అని అన్నారు. టీడీపీలో దళితులకు గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్ బాబు, కోయా ఆనంద్, కాసరనేని మురళీ, తుమ్మలపల్లి హరికృష్ణ, సుంకర రమేష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో ది పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యాన మంగళవారం వరద బాధితులకు పారిశ్రామికవేత్త, సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఎంతో మంది పేద ప్రజలు నిరాశ్రయులయ్యారని తెలిపారు. తమవంతు బాధ్యతగా రూ. 4.20 లక్షల విలువ చేసే కిట్లను 1,050 మందికి అందజేశామని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అలమండ ఎల్లారావు, కోశాధికారి జోత్స్న సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి పుణ్యా ఛారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఛారిటీస్ కార్యదర్శి జాస్తి విజయ భూషణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పెద్దలు మన జాతి సంపద అని చెప్పారు. వృద్ధాశ్రమాలు లేని సమాజం కావాలని ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ సిటిజన్ నెక్కంటి నాగేశ్వరరావు, వీరమాచినేని భవానీప్రసాద్, అట్లూరి ప్రేమ్‌చంద్ తదితరులను సత్కరించారు. పెద అవుటపల్లి జోసఫ్ తంబి వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, గన్నే వెంకట్రావు, ఆవుటపల్లి మోహనరావు, కేఎస్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవితవ్యం



ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో అథ్లెటిక్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు

కంకిపాడు: క్రీడలతో ఉజ్వల భవితవ్యం ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో పెనమలూరు నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ మీట్ మంగళవారం నిర్వహించారు. అథ్లెటిక్స్ మీట్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాకీ బాబు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. సర్పంచ్ పి. ఇందిర, హెచ్‌ఎం పద్మావతి, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జీవి. రమణ, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ సీనియర్ నేత ఎం.హరిగోపాల్, పెనమలూరు సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భవానీ, వై. మురళీ, పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. బాలికల విభాగంలో జరిగిన ఈ పోటీలను కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కేవీఆర్ కిషోర్ ప్రారంభించారు. అనంతరం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల జట్లకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ జట్లకు ఎంపికైన బాలబాలికలు జిల్లా స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని కిషోర్ ఆకాంక్షించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులకు అసోసియేషన్ ద్వారా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జ్ సీహెచ్ చంద్రశేఖర్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దామెర సీతారామయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతాహీ సేవ'లో ఇంజినీరింగ్ విద్యార్థులు



స్వచ్ఛతాహీ సేవలో ధనేకుల విద్యార్థులు

పెనమలూరు: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రం చేశారని ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ గన్నవరం ఐటీ పార్కు వద్ద తమ కాలేజీ విద్యార్థులు ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రపరిచి, వ్యర్థాలను తొలగించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ శ్రీనివాస్, సెక్రటరీ ఎన్ సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జీ శేఖర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు సరఫరా చేయాలి



చోడవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

గన్నవరం: ఇటీవల సంభవించిన వరదల వల్ల దెబ్బతిన్న వరిపైరు స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రాయితీపై విత్తనాలు సరఫరా చేయాలని కేసరపల్లి రైతులు వ్యవసాయ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరిసాగులో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ ఎస్ఎల్. తేజస్వి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు బలుగూరి బాబూరావు, బంకురు అప్పారావు, నీలం ఆంథోని, మర్రి జేవియర్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: చోడవరం, పెనమలూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ శాఖ డీడీ మనోహర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి పెట్టాలన్నారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకొని పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కనకమేడల శైలజ, చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం, వీఏఏలు వంశీ, అనూష, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నతెరేసమ్మ దేవాలయం ప్రతిష్ఠ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో మంగళవారం చిన్నతెరేసమ్మ దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన యనమలకుదురులో చిన్నతెరేసమ్మ దేవాలయం నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు మువ్వల ప్రసాద్, ఏలేటి విలయమ్ జయరాజు, కొలకాని మరియన్న, పసల తోమస్, మైఖేల్ పాల్గొని భక్తులకు ఉపదేశం ఇచ్చారు. గుమ్మడి జీవన్‌కుమార్ బృందం క్రైస్తవ నాటకం ప్రదర్శించి భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి విజయ్‌కుమార్, గుమ్మడి అలెక్స్, అన్వేష్, బంగారు రాజు, జోజిబాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

పెనమలూరు: మండల పరిధిలో 18,451 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 7,81,41,000 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో మంగళవారం ఉదయాన్నే సచివాలయ సిబ్బంది పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తాడిగడప ప్రాంతంలో పింఛన్లు పంపిణీ చేశారు. మండల పరిధిలో దాదాపు 96 శాతం పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, నర్రా చంటి, పీతా గోపీచంద్, ఎం.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని పునాదిపాడు సచివాలయం పరిధిలోని పింఛన్ లబ్ధిదారు నక్కా దుర్గ గన్నవరం ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ పవన్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

నలందలో ఘనంగా దసరా వేడుకలు



కంకిపాడు: నలంద విద్యానికేతన్ ఈడుపుగల్లు వసంత క్యాంపస్‌లో మంగళవారం దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నారులు ప్రత్యేక వేషధారణలో సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేసిన నృత్యాలు, ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నవదుర్గా మాతల వేషధారణలో చిన్నారులు భక్తిభావాన్ని నింపారు. దుర్గాదేవి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. ఆప్యాయత, అనురాగాలు పెంపొందేలా, కుటుంబ ప్రాధాన్యం తెలిసేలా అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని సీఏసీ ఎల్. సుధారాణి, ప్రిన్సిపాల్ పి. నాగలక్ష్మి, తెలుగు విభాగాధిపతి జె. ప్రభురాజు, ఎన్‌డిఎల్. ప్రసాద్ పర్యవేక్షించారు.

నిందితుల అరెస్ట్

ఉంగుటూరు: గొర్రెల చోరీ కేసులో నిందితులను ఉంగుటూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. మానికొండ గ్రామంలో జూలై నెలలో ఉయ్యూరు మండలం ఆకునూరు గ్రామానికి చెందిన జి. కిరణ్, కట్టా నాగబాబు, దోనేపూడి లక్ష్మీవరప్రసాద్ మూడు గొర్రెపోతులను చోరీ చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ యూ. గోవిందు తన సిబ్బందితో నిందితులను నందమూరులో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గన్నవరం కోర్టులో హాజరుపరిచారు.

రక్తదాన ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలి



రక్తదానం చేస్తున్న ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి

విమానాశ్రయం(గన్నవరం): రక్తదాన ఆవశ్యకతను సమాజంలో ప్రతిఒక్కరూ గుర్తించాలని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంతరెడ్డి పిలుపునిచ్చారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ భవనంలో మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించడంతోపాటు రక్తదానం చేశారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అత్యావసర పరిస్థితుల్లో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. రక్తదానం చేసిన ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌తోపాటు ఉద్యోగులు, సిబ్బందికి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీఎస్ఎస్ బాలాజీ అభినందనలు తెలిపారు. అనంతరం రక్తదాతలకు రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున సర్టిఫికెట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, కోశాధికారి శ్రీరామ్ బాలాజీ, గన్నవరం బ్రాంచ్ సొసైటీ ఛైర్మన్ చిన్ని మాధవీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన

పెనమలూరు: విద్యార్థులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ సూచించారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో రక్తదానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల గుండెజబ్బులు రావని, బరువు, బీపీ నియంత్రణలో ఉంటాయని పేర్కొన్నారు. రక్తదానంతో తలసేమియా వ్యాధితో బాధపడే వారిని కాపాడవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

మూత పడిన ప్రభుత్వ మద్యం షాపులు



కంకిపాడు ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న సేల్స్‌మెన్స్, సూపర్‌వైజర్లు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు మద్యం పాలసీకి వ్యతిరేకంగా ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది నిరసనకు దిగడంతో మంగళవారం మండల పరిధిలో ప్రభుత్వ మద్యం షాపులు తెరుచుకోలేదు. ఇదే అదునుగా బార్‌షాపుల్లో ధరలు పెంచి మద్యం ప్రియుల జేబులు లూటీ చేశారు. మండల పరిధిలో గోసాల, గంగూరు, పెనమలూరు, చోడవరం, కానూరు ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నాయి. అయితే ప్రభుత్వం మద్యం పాలసీని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రభుత్వ మద్యం షాపుల్లో ఉన్న ఉద్యోగులు నిరసనగా మంగళవారం ప్రభుత్వ మద్యం షాపులు తెరవలేదు. షాపులకు తాళాలు తీయకపోవడంతో మద్యం ప్రియులు ఇబ్బందులు పడ్డారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కంకిపాడు: ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఏపీ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ మంగళవారం కంకిపాడు ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన తెలిపారు. ఏపీ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు సేల్స్‌మెన్‌లు, సూపర్‌వైజర్లు మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, లేనిపక్షంలో ఔట్‌సోర్సింగ్‌లో ఇతర శాఖల్లో నియామకాలు చేసి ఉపాధి చూపాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులకు సమస్యలతో కూడిన వినతులు అందించామని వారు తెలిపారు.

నూతన యాగశాలలో ప్రత్యేక చండీహోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్మించిన యాగశాలలో చండీహోమం నిర్వహించడానికి దేవస్థాన వైదిక కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రాధాకృష్ణుల విగ్రహం వద్ద రూ. 5 కోట్ల అంచనాలతో నూతన యాగశాలను నిర్మించారు. దీన్ని ఏప్రిల్‌లో ప్రారంభించినా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలలుగా యాగశాలకు తుది మెరుగులు దిద్దడంతోపాటు ఆరు అడుగుల మేర విస్తరణ చేపట్టారు. దసరా ఉత్సవాల్లో నిర్వహించే ప్రత్యేక చండీహోమం నూతన యాగశాలలో నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది.

క్రీడల్లో సత్తాచాటిన బాపులపాడు విద్యార్థులు



హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. అండర్–14 కేటగిరిలో 10 మంది, అండర్–17లో 12 మంది విద్యార్థులు వివిధ క్రీడాజట్లకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయుడు పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ విద్యార్థులు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో గన్నవరం నియోజకవర్గ జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.